
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 29 జూలై 2025



నేటి నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సుల విద్యార్థులకు వర్సిటీ కేంద్రంగా రెండో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని డీన్ డాక్టర్ ఎస్. ఉదయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 6 వరకు జరగనున్న ఈ పరీక్షలకు 688మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు చెప్పారు.

అలాగే అంబేడ్కర్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న స్పెషల్ బీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను సోమవారం వర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 33 మంది హాజరు కాగా, శతశాతం ఉత్తీర్ణత సాధించారు.

అభివృద్ధి మెండుగా.. సంక్షేమం నిండుగా..

- కూటమి పాలనలో ప్రగతి ఫలాలు
- గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



లోహరిబందలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే శిరీష

హరిపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): 'కూటమి పాలనతో పల్లెలో ప్రగతి కనిపిస్తోంది. అభివృద్ధి మెండుగా.. సంక్షేమం నిండుగా ప్రభుత్వ పాలన సాగుతోంద'ని గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం మందస మండలం లోహరిబందలో ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి ఆయన పర్యటించారు. సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తూ.. వృద్ధులు, మహిళలు, యువతతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు గురించి తెలుసుకున్నారు. గ్రామంలో టీడీపీ జెండా ఆవిష్కరించారు. రూ.90లక్షలతో నిర్మించిన లోహరిబంద రోడ్డు, రూ.1.60 కోట్లుతో నిర్మించిన ఎల్ కొత్తూరు - మర్రిపాడు తారురోడ్డును ప్రారంభించారు. అనంతరం జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి దాసరి తాతారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులతోపాటు పేదలకు సంక్షేమం అందజేస్తున్నామని తెలిపారు.

- ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ 'ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని సీఎం చంద్రబాబు కానుకగా ఇవ్వనున్నారు. విద్యార్థులకు కిట్లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌తోపాటు తల్లికి వందనం, ఉచిత సిలిండర్ పథకాలను అమలు చేస్తున్నాం. ఇంకా మరిన్ని (మిగతా 6వ పేజీలో..)

అక్రమార్కులను వదిలే ప్రసక్తేలేదు

మందస మండలం నల్లబొడ్లూరులో కంకర కొండను తవ్వి గ్రావెల్ దోచుకుపోయిన అక్రమార్కులను వదిలే ప్రసక్తే లేదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. కంకర కొండను ఆయన పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇళ్లపట్టాలు, పాఠశాల క్రీడా మైదానం పేరుతో విన్యాసాలు చేసి అక్రమాలకు పాల్పడ్డారని స్థానికులు తెలియజేయటంతో అవాక్కయ్యారు. కొండలనే మాయం చేసిన ఘనులు ఇక్కడ ఉన్నారని, వైసీపీ నాయకుల ధనదాహానికి ప్రకృతి వనరులు బలయ్యాయని మంత్రి విమర్శించారు. అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వండి

- ఎత్తిపోతల పథకాల నుంచి తాత్కాలికంగా నిలుపదల చేయాలి
- మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి/ నందిగాం, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరినాట్లకు ఇబ్బందులు లేకుండా వంశధార ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. 'వంశధార ఎడమ కాలువ పరిధిలో ఉన్న ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిసరఫరాను తాత్కాలికంగా నిలుపుదల చేయాలి. పలాస, టెక్కలి, నందిగాం మండలాల పరిధిలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం గొట్టాబ్యారేజీ నుంచి ఎడమ కాలువ ద్వారా అందిస్తున్న 1600 క్యూసెక్కులకు అదనంగా మరో 200 క్యూసెక్కులు పెంచాలి. కాలువకు గండ్లు పడకుండా పర్యవేక్షించేందుకు తాత్కాలిక సిబ్బందిని నియమించాలి. రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉంచాల'ని మంత్రి అచ్చెన్న ఆదేశించారు. కార్యక్రమంలో వంశధార ప్రాజెక్టు ఛైర్మన్ అరవల రవీంద్ర, ఇరిగేషన్ అధికారులు స్వర్ణకుమార్, బి.శేఖర్, మన్మధరావు, వ్యవసాయశాఖ అధికారులు త్రినాథస్వామి, జగన్మోహనరావు, శ్రీకాంత్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు కె.హరివరప్రసాద్, పి. అజయ్ కుమార్, నంబాళ శ్రీనివాస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

'వ్యవసాయాన్ని సులభతరం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 80 శాతం రాయితీపై డ్రోన్లు అందిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాల'ని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. నిమ్మాడలో వ్యవసాయానికి ఉపయోగించే డ్రోన్‌ను ఆయన ప్రారంభించారు. నందిగాం మండలం నరేంద్రపురం రైతులకు రాయితీపై డ్రోన్‌లను పంపిణీ చేశారు. సాగులో డ్రోన్ల వినియోగం ద్వారా రైతులకు కూలి ఖర్చులతోపాటు సమయం ఆదా అవుతుందని తెలిపారు. దిగుబడి కూడా పెరుగుతుందన్నారు.

ఆరోగ్య రక్షణకు ఓఆర్ఎస్!

- అతిసారం నుంచి కాపాడుతుంది
- శరీరంలో నీటి శాతం పెంపునకు దోహదం
- నేడు ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవం



నరసన్నపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): మన శరీరానికి తగినంత నీరు అందకపోతే డీహైడ్రేషన్‌కి గురవుతాం. తద్వారా అవయవాలు సరిగా పనిచేయక అనారోగ్యం బారిన పడతాం. అలాగే అతిసారం వల్ల వృద్ధులు, పిల్లలు తీవ్రమైన డీహైడ్రేషన్‌తో ద్రవాలు కోల్పోయి మరణించిన సంఘటనలు ఉన్నాయి. ఇటువంటి మరణాలను తగ్గించేందుకు, ఆరోగ్యానికి రక్షణ కల్పించేందుకు ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్స్) సంజీవనిలా పనిచేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల మేరకు ఓఆర్ఎస్‌పై అవగాహన పెంచేందుకు ఏటా జూలై 29న ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇంట్లో తక్కువ ఖర్చుతోనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తయారుచేసుకోవచ్చని, దీనిద్వారా శరీరంలో నీటిశాతం పెరిగి ఆరోగ్యంగా ఉంటారని వైద్యనిపుణులు చెబుతున్నారు.

- ప్రాముఖ్యత ఇదే..

ఓఆర్ఎస్ అనేది చక్కెర, ఉప్పు, నీరు కలిసిన మిశ్రమం. ఇది డీహైడ్రేషన్ బారి నుంచి కాపాడుతుంది. శిశువుల ఆరోగ్యం, వారి శ్రేయస్సుకి అమృతంలా పనిచేస్తుంది. పిల్లల మరణాలు తగ్గించడం, తల్లి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, (మిగతా 6వ పేజీలో..)

నీటిశాతం పెంచుతుంది

శరీరంలో నీటి శాతం పెంచడంలో ఓఆర్ఎస్ దోహదపడుతుంది. ఆరోగ్యంగా ఉన్నవారు కూడా ఓఆర్ఎస్ తీసుకోవచ్చు. షుగర్, బీపీ పేషెంట్లు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

- డా.సీపాన శ్రీనివాసబాబు, సూపరింటెండెంట్, వంద పడకల ఆస్పత్రి, నరసన్నపేట

అతిసారం నుంచి విముక్తి

చిన్నపిల్లలకు అతిసారం నుంచి విముక్తి కల్పించడంలో ఓఆర్ఎస్ అమృతంలా పనిచేస్తుంది. డాక్టర్ల సలహాపై తల్లిదండ్రులు ఓఆర్ఎస్ ద్రావణాన్ని పిల్లలకు ఇవ్వాలి. ఇది శరీరంలో డీహైడ్రేషన్‌ను నివారిస్తుంది. పిల్లలకు, పెద్దల ఆరోగ్యానికి ఓఆర్ఎస్ దోహదపడుతుంది.

- మెండ సుధారాణి, చిన్నపిల్లల వైద్యనిపుణులు, ప్రభుత్వ ఆస్పత్రి, నరసన్నపేట

ఆలయాల్లో సీసీ నిఘా

- ప్రతి గుడిలోనూ కెమెరాల ఏర్పాటు
- పోలీస్‌శాఖకు పూర్తి వివరాలు
- నేర నియంత్రణే ముఖ్య ఉద్దేశం
- బంగారు, వెండి ఆభరణాలకు బీమా
- దేవదాయశాఖకు ప్రభుత్వ ఆదేశాలు



డీఆర్ వలసలో ఆలయాన్ని పరిశీలిస్తున్న జేఆర్‌పురం సీఐ అవతారం (ఫైల్)

- ఈ నెల 11న జి.సిగడాం మండలం డీఆర్ వలస గ్రామంలోని శివాలయంలో విగ్రహాలు ధ్వంసం అయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేసి గ్రామానికి చెందిన వేమల రామకృష్ణ మద్యం మత్తులో ఈ ఘటనకు పాల్పడినట్టు గుర్తించారు.

- ఈ ఏడాది మే 21న ఎచ్చెర్ల మండలం ముద్దాడలోని అసిరిపోలమ్మ ఆలయంలో చోరీ జరిగింది. తులం బంగారం, అరతులం వెండితో పాటు హుండీలోని రూ.15వేల నగదును దొంగలు ఎత్తుకుపోయారు. గ్రామానికి దూరంగా ఆలయం ఉండడం, సీసీ కెమెరాలు లేకపోవడంతో కేసును చేధించడంలో పోలీసులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

- ఈ ఏడాది మార్చి 4న పలాసలోని సూదికొండ కాలనీలోని కొండమ్మతల్లి గ్రామదేవత ఆలయంలో చోరీ జరిగింది. పట్టపగలే దొంగలు హుండీని పగులగొట్టి రూ.10వేల వరకూ నగదును పట్టుకుపోయారు. ఆ సమయంలో గుడిలో సీసీ కెమెరాలు లేవు.

రణస్థలం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ..ఇలా జిల్లాలోని ఆలయాల్లో తరచూ చోరీలు, విధ్వంసకర ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల నేరాలు, మత విద్వేషాలు, వర్గ వైషమ్యాలు పెరుగుతున్నాయి. భావవ్యక్తీకరణ పేరుతో రెచ్చగొట్టడాలు జరుగుతున్నాయి. మరోవైపు గంజాయి, మద్యం మత్తులో ఆకతాయిల చర్యలు కూడా పెరుగుతున్నాయి. విగ్రహాల ధ్వంసం, దాడులు వంటివి జరుగుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఆలయాల భద్రతకు పెద్దపీట వేస్తూ.. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీసు శాఖకు ఆదేశించింది. దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలే కాకుండా.. చిన్నచిన్న ఆలయాల్లో సైతం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎస్పీ మహేశ్వరరెడ్డి చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని ప్రతీ గ్రామంలో (మిగతా 6వ పేజీలో..)

అన్ని ఆలయాలకూ..

జిల్లాలో దేవదాయశాఖ పరిధిలో 749 దేవాలయాలు ఉన్నాయి. గ్రామస్థులు, ఆలయ కమిటీలతో నడిచేవి మరో 2 వేల వరకూ ఉంటాయి. సాధారణంగా శివాలయాలతోపాటు గ్రామదేవత ఆలయాలు దేవదాయ శాఖ పరిధిలోకి రావు. వాటిని గ్రామస్థులే నిర్వహిస్తుంటారు. కాగా లక్షలాది రూపాయలతో నిర్మిస్తున్న ఆలయాలకు భద్రత కరువవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అటువంటి ఆలయాల్లో పోలీసుశాఖ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది. ఒక్కో సీసీ కెమెరా ఏర్పాటుకు సుమారు రూ.30వేల నుంచి రూ.40 వేలు ఖర్చుకానుంది. ప్రస్తుతం దేవదాయశాఖ పరిధిలోని అన్ని ఆలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయింది. మిగతా గ్రామాలు, గ్రామ కమిటీల ఆధీనంలో ఉన్న ఆలయాలకు సంబంధించి నిర్వాహకులతో చర్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

నిఘా పెట్టాం

ఎస్పీ ఆదేశాల మేరకు ఆలయాల్లో చోరీల నియంత్రణపై ప్రత్యేక దృష్టిపెట్టాం. ఇప్పటికే అన్ని ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. ఆలయ కమిటీలు, గ్రామపెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు అందించాం. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే 100కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించాం.

- సీఐ ఎం.అవతారం, జేఆర్ పురం సర్కిల్

ప్రత్యేక దృష్టి

జిల్లావ్యాప్తంగా ఆలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అక్కడ దొంగతనాల నియంత్రణతో పాటు విగ్రహాల ధ్వంసం, విద్రోహక చర్యలు జరగకుండా అడ్డుకట్ట వేస్తాం. అందుకే అన్ని ఆలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయించాం. ఈ విషయంలో ఆలయ కమిటీలు, నిర్వాహకులు సహకరించాలి. కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

- డీఎస్పీ సీహెచ్ వివేకానంద, శ్రీకాకుళం

ఒడిశా పోలీసులకు పట్టుబడిన ఎచ్చెర్ల ఎంపీపీ

- 1999లో చీటింగ్ కేసు నమోదు..
- ఎన్‌బీడబ్ల్యూ జారీ

శ్రీకాకుళం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఓ పాత కేసు విషయంలో ఎచ్చెర్ల మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) మొదలవలస చిరంజీవిని సోమవారం ఒడిశా రాష్ట్రం పోలీసులు తీసుకెళ్లారు. 1999లో ఒడిశాలో ఉన్నప్పుడు ఎంపీపీ చిరంజీవిపై అక్కడ చీటింగ్ కేసు నమోదైంది. దీనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీఅయింది. ఈ నేపథ్యంలో ఒడిశాలోని కొరాపుట్, దమన్‌జోడి పోలీసులు సోమవారం ఎంపీపీ స్వగ్రామం ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటకు వచ్చి.. స్థానిక పోలీసుల సహకారంతో చిరంజీవిని అదుపులోకి తీసుకున్నారు. ఎంపీపీ చిరంజీవిపై ఇప్పటికే పలు కేసులు శ్రీకాకుళం, ఎచ్చెర్ల పోలీసుస్టేషన్‌లో నమోదయ్యాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు శ్రీకాకుళంలో ఓ వైశ్య సామాజిక వర్గానికి చెందిన యువకుడ్ని బెదిరించి అతనితో ఆస్తిపత్రాలపై సంతకాలు చేయించుకున్నాడని.. శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు కూడా అప్పట్లో పెద్దగా ఏమీ చేయలేకపోయారు. అలానే.. ఎచ్చెర్ల మండలంలో పలు విషయాల్లో సెటిల్‌మెంట్‌లు, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు, ఫిర్యాదులు పోలీసులకు అందాయి. గత ప్రభుత్వంలో ఉన్న పోలీసులు ఇప్పుడు లేకపోవడంతో కేసులు నిష్పక్షపాతంగా నమోదవుతున్నాయి. సొంత పార్టీ కార్యకర్తపైనే హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉండడంతో చిరంజీవిని ఏడాది కిందట వైసీపీ నుంచి బహిష్కరించారు. అయినప్పటికీ వైసీపీ కార్యకర్తలు, నాయకులతో సత్సంబంధాలు నెరుపుతూ వివాదాస్పద నాయకుడిగానే ఆయన ముద్రపడ్డారు.



బాధితులతో మాట్లాడుతున్న పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్

మా డబ్బులు ఇవ్వండి

- ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయంలో ఖాతాదారుల ఆందోళన
- అధికారులను నిలదీసిన వైనం

ఇచ్ఛాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయంలో రూ.కోట్లలో జరిగిన భారీ స్కాంపై అధికారులను ఖాతాదారులు నిలదీశారు. సోమవారం పోస్టల్ కార్యాలయం లోపల ఆందోళన చేశారు. తాము దాచుకున్న డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మా పిల్లల పేరున పోస్టాఫీసులో కేవీపీ బాండ్ల రూపంలో డబ్బులు దాచుకుంటే.. సైబర్ నేరగాళ్లతో కలిసి పైసా కూడా లేకుండా ఖాతా ఖాళీ చేసేశారని బాధితులు లోహిదాస్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన కేవీపీ బాండ్లు కూడా నకిలీవేనని, తమ పరిస్థితి ఏంటని నిలదీశారు. ప్రతీ ఖాతాదారుడికి దాచుకున్న డబ్బులు అందజేస్తామని సోంపేట పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ హామీ ఇచ్చారు. దీనికి పోస్టల్ డిపార్ట్‌మెంట్ పూర్తి బాధ్యత వహిస్తుందని, ఖాతాదారులెవరూ ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. మేము చేపడుతున్న విచారణకు సహకరిస్తే.. వీలైనంత తొందరలో మీకు డబ్బులు ఇచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. మంగళవారం సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ అధికారి హరిబాబు వచ్చి.. బాధితులతో మాట్లాడి ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. ఇప్పటివరకూ 33 మంది ఖాతాదారులను బాధితులుగా గుర్తించామని, ఇంకా ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఉన్నతాధికారులు ఏమి చేస్తున్నారు?

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు ఖాతాదారులకు (మిగతా 6వ పేజీలో..)

అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదిక- 'మీ కోసం' కార్యక్రమంలో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి 98 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'అధికారులు స్వయంగా పర్యవేక్షించి, నిర్ణీత సమయంలోగా అర్జీలను పరిష్కరించాలి. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలి. ఫిర్యాదులు రీఓపెన్ కారాద'ని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ డి. పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఓటరు నమోదులో సమస్యలుంటే తెలపండి: డీఆర్వో

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదులో సమస్యలుంటే తెలియజేయాలని డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అన్ని రాజకీయ పార్టీలు బూత్‌స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఎటువంటి అభ్యంతరాలున్నా తెలియజేయాల'న్నారు. బూత్‌స్థాయి అధికారులు యాక్టివ్‌గా ఉండేలా చూడాలని టీడీపీ ప్రతినిధి పీఎంజే బాబు కోరారు. సమావేశంలో డి.శంకరరావు(వైసీపీ), గౌరీశంకరరావు (సీపీఎం), సురేష్‌బాబు సింగ్ (బీజేపీ), భూపతి అర్జున్ కుమార్(జనసేన), సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం టు పాతపట్నం



- విస్తృతంగా పులి సంచారం
- రెండేళ్లలో రెండుసార్లు రాక
- పాదముద్రలను గుర్తించిన అధికారులు
- ఒడిశా నుంచి వచ్చినట్లు నిర్ధారణ
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

ప్రశాంతతకు... పచ్చని కొబ్బరి తోటలకు ప్రసిద్ధిగాంచిన ఉద్దానంలో రెండేళ్ల కిందట తొలిసారిగా పులి అడుగుజాడలు కనిపించాయి. ఒడిశా సరిహద్దుల నుంచి ఉద్దానంలోకి అది ప్రవేశించినట్లు అధికారులు గుర్తించారు. వివిధ గ్రామాల్లో సంచరించినట్లు పాదముద్రలు లభ్యమయ్యాయి. పశువులపై దాడి చేసి చంపేసినట్లు ఆనవాళ్లు దొరికాయి. పులి సంచరిస్తున్నట్లు తెలియడంతో ఉద్దానం వాసులు వణికిపోయారు. మళ్లీ ఏడాది తరువాత మరోసారి కలకలం సృష్టించింది. ఇచ్ఛాపురం ప్రాంతంలో తొలిసారి కనిపించిన పులి... చివరిసారిగా పాతపట్నం ప్రాంతంలో సంచరించింది. అటు తరువాత ఒడిశా వైపు వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. రెండుసార్లూ ఒకే సీజన్‌లో కనిపించడం గమనార్హం.

కంచిలి/సోంపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలో సామాజిక అటవీ ప్రాంతంతో పాటు రిజర్వు అటవీ భూములు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ ఈ ప్రాంతంలో పులుల ఉనికి గానీ, సంచారం గానీ గతంలో ఎన్నడూ లేవు. 2023 సెప్టెంబరులో ఉద్దానంలో తొలిసారి పులి అడుగు జాడలు కనిపించాయి. అటు ఇచ్ఛాపురం మండలం నుంచి ఇటు సోంపేట మండలం వరకు ప్రతిరోజూ పులి జాడలు వెలుగుచూసేవి. దీంతో నియోజకవర్గ ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడిపేవారు. ఆ ఏడాది అక్టోబరు 2న సోంపేట మండలం బెంకిలిలో పులి పాదముద్రలు కనిపించగా... అదేరోజు కర్తలి పాలెంలో ఆవుపై దాడి చేసి చంపేసినట్టు అధికారులు గుర్తించారు. దాదాపు పక్షం రోజుల పాటు అలజడి సృష్టించింది.



కంచిలి: పులి జాడపై ఆరా తీస్తున్న అటవీశాఖాధికారి (ఫైల్)

ఏడాది తరువాత మళ్లీ..

సరిగ్గా ఏడాది తరువాత పులి అడుగుజాడలు ఉద్దానంలో మళ్లీ కనిపించాయి. గత ఏడాది అక్టోబరు 28న కంచిలి మండలం అమ్మవారిపుట్టుగ, మండపల్లి, నారాయణపురం సమీపంలో పులి పాదముద్రలను గుర్తించారు. అదే విధంగా కవిటి మండలం బెజ్జిపుట్టుగ, జగతి, పుక్కళ్లపాలెం గెడ్డ సమీపంలో, ఇచ్ఛాపురం మండలం పత్రిపుట్టుగ, కొఠారి, ఈదుపురం, తిప్పనపుట్టుగ గ్రామాల పరిసరాల్లో పులి అడుగులు కనిపించాయి. దీంతో అటు స్థానిక ప్రజలతో పాటు అధికారులు ఉలిక్కిపడ్డారు. పలాస ఆర్డీవో భరత్ నాయక్‌తోపాటు అటవీశాఖ ఉన్నతాధికారులు మురళీకృష్ణంనాయుడు, సిబ్బంది ఆ గ్రామాలకు చేరుకుని, పులి సంచారంపై ఆధారాలు సేకరించారు. స్థానికులతో మాట్లాడి వారిలో భయాందోళనలను తొలగించడంతోపాటు భద్రతా చర్యలపై హామీ ఇచ్చారు. అయినా సుమారు నెల రోజుల పాటు ఉద్దానం పరిసరాల ప్రజలు సాయంత్రమైతే బయటకు వచ్చేందుకే భయపడిన దుస్థితి నెలకొంది.

ఒడిశా నుంచి రాక..

ఉద్దానం ప్రాంతానికి సమీపంలో ఉన్న మహేంద్రగిరి కొండల్లో (ఒడిశా) పులుల ఉనికి ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతమైన గండాహతి ప్రాంతంలో తొలిసారి కనిపించింది. అక్కడి నుంచి పలాస మండలంలోని పొలాల మీదుగా వజ్రపుకొత్తూరు, ఉద్దానం ప్రాంతానికి చేరుకుని ఉంటుందని అధికారులు భావించారు. పులి సంచరించిన ప్రాంతాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేయడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే, కొన్నిచోట్ల పులి దాడిలో తమ పశువులు మృతి చెందినట్లు రైతులు చెబుతున్నారు.

ఆవును బలిగొంది

సంతబొమ్మాళి, జూలై 28(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎన్‌పేట పంచాయతీ పెద్దకేశునాయుడుపేటలోని భద్రాచలం రామ్మూర్తికి చెందిన ఆవును ఎనిమిది నెలల క్రితం ఓ జంతువు బలిగొంది. దీంతో వారు అటవీశాధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ జంతువు పాదముద్రల ఆధారంగా పెద్దపులిగా గుర్తించి ఈ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

రుక్కి అడవిలో..

హరిపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మహేంద్రగిరుల నుంచి మందస వరకు వ్యాపించి ఉన్న రుక్కి అడవిలో గతేడాది డిసెంబరులో పెద్దపులి జాడలు కనుగొన్నారు. అప్పటి అటవీ శాఖాధికారి రాము ఆధ్వర్యంలో లక్ష్మణమూర్తి, పోలయ్య, వెంకటేష్, జోగారావు బృందం భావనాపురం చెరువు వద్ద బురదలో పులి పాదముద్రలను గుర్తించారు. ఒడిశా నుంచి వచ్చినట్టు నిర్ధారించుకున్నారు. 2024లో అదే సీజన్‌లో పులి సంచరించి.. మళ్లీ ఒడిశాలోని మహేంద్రగిరుల వైపు వెళ్లినట్లు తెలియజేశారు.



చీపి వద్ద పాదముద్రలు గుర్తిస్తున్న డీఆర్వో రాము(ఫైల్) →

రాత్రి వేళల్లో సంచారం

జలుమూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): గత ఏడాది నవంబరు 29న కోటబొమ్మాళి మండలంలో కనిపించిన పులి... జలుమూరు మండలం ఎర్రన్నపేట, సంతలబైలి పొలాలు మీదుగా సారవకోట మండలం జమచక్రం, చోలసముద్రం, కిడిమి పొలాల్లోకి చేరుకుంది. ఆ మరునాడు ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు పులి పాదముద్రలను గుర్తించి.. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. బీట్ అధికారి శివప్రసాద్, సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు. జలుమూరు మండలం ఎర్రన్నపేట, సంతలబైలి పొలాల్లోనూ పులి పాదముద్రలను గుర్తించారు. ఇది ఎక్కువగా రాత్రి సమయంలోనే ప్రయాణం సాగించడంతో ప్రజల కంట పడలేదు. ఆ తరువాత పాతపట్నం, పర్లాకిమిడి మీదుగా ఒడిశాలోని అటవీ ప్రాంతం వైపు వెళ్లినట్టు అటవీ శాఖ అధికారులు తెలిపారు.



చోలసముద్రం పొలాల్లో గుర్తించిన పులి పాదముద్రలు (ఫైల్)

ఏడాదికోసారి...

కోటబొమ్మాళి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఏడాదికోసారి టెక్కలి, మెళియాపుట్టి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, జలుమూరు, సారవకోట మండలాల్లో పులి సంచరించడం పరిపాటిగా మారిందని అటవీశాఖ అధికారి జి.జగదీశ్వరరావు అన్నారు. గత ఏడాది నవంబర్ 29న తెల్లవారుజామున కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు సమీపంలో జాతీయ రహదారి దాటుతుండగా 108 వాహన సిబ్బంది గుర్తించారని తెలిపారు. 108 వాహనం సైరన్ మోగించటంతో పులి వేగంగా పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకుపోయిందని తెలిపారు. 108 వాహన పైలెట్ ఉప్పాడ అప్పలనాయుడు ఆ పరిసర ప్రాంతాల్లోని మిత్రులకు సమాచారం ఇచ్చారని చెప్పారు. తాము ఉదయం పులి పాదముద్రలను గుర్తించామని తెలిపారు. 2023లో వచ్చిన పులి పాదముద్రలను, గత ఏడాది నవంబర్‌లో వచ్చిన పులి పాదముద్రలను కొలతలు వేసి పరిశీలించామని తెలిపారు. అదే పులి మళ్లీ ఈప్రాంతానికి వచ్చినట్లు నిర్ధారించుకున్నామని జగదీశ్వరావు చెప్పారు.

హడలిపోయా..

2024 నవంబర్ 29న సంతబొమ్మాళి నుంచి ఒక రోగిని శ్రీకాకుళంలోని ఆస్పత్రిలో చేర్పించి తిరిగి వస్తున్నాం. పొడుగుపాడు వద్ద రాత్రి ఒంటిగంట సమయంలో రోడ్డు దాటుతున్న పెద్ద పులిని చూసి హడలిపోయాను. ఏం చేయాలో తెలియక భయంతో సైరన్ మోగించాను. దీంతో పులి పొలాల్లోకి పరుగుతీసింది. వెంటనే సమీప గ్రామాల్లోని తెలిసిన వ్యక్తులకు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాను.

- ఉప్పాడ అప్పలనాయుడు, 108 వాహనం పైలెట్, హరిశ్చంద్రపురం



పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

అప్పట్లో అలజడి

టెక్కలి, జూలై 28(ఆంధ్రజ్యోతి): వరుసగా రెండేళ్ల పాటు నవంబరు, డిసెంబరు నెలల్లో ప్రత్యక్షమైన పులి ఈసారి ముందే ప్రత్యక్షమైందని కొందరు చెబుతుండగా అటవీశాఖ యంత్రాంగం మాత్రం అది పులి కాదని ఫిషింగ్ క్యాట్ అడుగులని చెబుతున్నారు. రెండేళ్ల కిందట ఒడిశాలోని గండాహతి ప్రాంతంలో ప్రత్యక్షమై మందస, కంచిలి, కవిటి మండలాలతో పాటు తీరప్రాంతంలో సంచరించింది. చివరికి నందిగాం, టెక్కలి, సారవకోట, పాతపట్నం మీదుగా ఒడిశా వెళ్లిపోయింది. అప్పట్లో ఈ పులి అడుగుజాడలను అటవీశాఖ అధికారులు గుర్తించి స్థానికులను అప్రమత్తం చేశారు. టెక్కలి మండలం గూడేం సమీపంలో రిటైర్డు ఆర్మీ ఉద్యోగి పులిని గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ తరువాత టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ జీడిపేట, జక్కరపేట కొండల్లో గ్రామస్థులు పులిని చూశారు. అటవీశాఖ అధికారులు పులికోసం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి తెంబూరు, పాతపట్నం మండలం నుంచి ఒడిశాకు వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా... ఈ ఏడాది వేసవిలో జయకృష్ణాపురం గ్రామస్థులు ఫిషింగ్ క్యాట్‌ను పట్టుకున్నారని... దానిని డమర కొండల్లో విడిచిపెట్టామని... అది చూసిన కొందరు పులి అని ప్రచారం చేశారని బీట్ ఆఫీసర్ పినకాన ఝాన్సీ తెలిపారు.



పులి అడుగుజాడలను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది (ఫైల్)

అభివృద్ధి మెండుగా.. సంక్షేమం నిండుగా..

(ఐదో పేజీ తరువాయి)

సంక్షేమ పథకాలు అమలు చేస్తామ'ని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చౌదరి బాబ్జీ, వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, బావన దుర్యోధన, రట్టి లింగరాజు, తమిరి భాస్కరరావు, చంద్రశేఖర్, మండల లచ్చయ్య, దేబాసిస్ పండా, బొంగుదామోదరం, నవీన్, సాలిన మాధవరావు పాల్గొన్నారు.

ఆలయాల్లో సీసీ నిఘా

(ఐదో పేజీ తరువాయి)

ఆలయాలు, ఆలయ కమిటీ సభ్యుల వివరాలు సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. చోరీల నియంత్రణ, కేసులు త్వరితగతిన ఛేదించడానికి సీసీ కెమెరాలు దోహదపడతాయని భావిస్తున్నారు.

ఆభరణాలకు బీమా..

జిల్లాలో అరసవల్లిలో శ్రీసూర్యనారాయణ క్షేత్రం, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, టెక్కలి ఎండల మల్లికార్జునస్వామి ఆలయం, పాతపట్నం నీలమణి దుర్గమ్మ, కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి, ఇచ్ఛాపురం తులసమ్మ, శ్రీకాకుళంలో ఉమారుద్ర కోటేశ్వరాలయం, కమ్మసిగడాంలో మహాలక్ష్మి అమ్మ వంటి ఆలయాల్లో విలువైన బంగారం, వెండి ఆభరణాలు ఉన్నాయి. ప్రభుత్వం తాజాగా ఈ వస్తువులకు బీమా చేయాలని దేవదాయశాఖ అధికారులకు ఆదేశాలిచ్చినట్టు తెలుస్తోంది. దొంగతనాలు, ఇతరత్రా మార్గాల్లో నష్టం జరిగితే బీమా కొంతవరకూ అండగా నిలిచే అవకాశం ఉంటుంది.

ఆరోగ్య రక్షణకు.. ఓఆర్‌ఎస్!

(ఐదో పేజీ తరువాయి)

వ్యాధులను ఎదుర్కోవడంలో దోహదపడుతుంది. 1960 తర్వాత ఓఆర్‌ఎస్ ప్రాముఖ్యతను యూనిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల మేరకు ఐదేళ్లలోపు పిల్లల మరణాలకు అతిసారం సంబంధిత వ్యాధులే కారణం. ఏటా ప్రపంచ వ్యాప్తంగా 1.7 బిలియన్ల మంది పిల్లలను అతిసారం ప్రభావితం చేస్తోంది. డయేరియా కారణంగా డీహైడ్రేషన్‌తో ఏటా 5.25లక్షల మంది చిన్నారులు చనిపోతున్నారని డబ్ల్యూహెచ్‌వో ధ్రువీకరించింది. ఓఆర్‌ఎస్ ద్రావణం తాగితే.. డీహైడ్రేషన్‌ను నిరోధిస్తుంది. రెండేళ్లలోపు చిన్నారులకు 50 -100 ఎం.ఎల్, రెండు నుంచి పదేళ్లలోపు పిల్లలకు 100 - 200 ఎం.ఎల్, పెద్దలకు తగు పరిమాణంలో ఓఆర్‌ఎస్ తీసుకోవచ్చని వైద్యనిపుణులు సూచించారు. వేసవిలో ఎండల తీవ్రత నుంచి ఓఆర్‌ఎస్ ఎంతో ఉపశమనం ఇస్తుందని స్పష్టం చేశారు. డీహైడ్రేషన్‌తో ప్రమాదాలు, ఓఆర్‌ఎస్ వినియోగంపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచాల్సి ఉందని పలువురు పేర్కొంటున్నారు.

మా డబ్బులు ఇవ్వండి

(ఐదో పేజీ తరువాయి)

అండగా నిలిచారు. రూ.కోట్లలో స్కాం జరిగితే ఉన్నతాధికారులు రాకుండా ఏమి చేస్తున్నారని డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌ను ఆయన నిలదీశారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ అధికారి హరిబాబుతో ఫోన్లో మాట్లాడారు. భారీ కుంభకోణంపై ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో విచారణ చేయడం సరికాదని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. బాధితుల నుంచి గ్రీవెన్స్‌లు తీసుకుంటున్నామని, అందరికీ న్యాయం చేస్తామని హరిబాబు తెలిపారు. మంగళవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. ఖాతాదారుల పాస్‌పుస్తకాలు పరిశీలించి.. ఆన్‌లైన్ డేటాతో సరిచూస్తామన్నారు. అవకతవకలు జరిగితే సరిచేస్తామన్నారు. ఖాతాదారులందరికీ దాచుకున్న డబ్బులను అందజేస్తామని స్పష్టం చేశారు.

మూడేళ్లుగా వేడుకుంటున్నా.. కనికరించడం లేదు

- 1బీలు ఇప్పించండి
- 'మీకోసం'లో గిరిజనుల ఆవేదన

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): 'మాది కొత్తూరు మండలంలోని దాపాకుల గూడ గ్రామం. మేమంతా పేద గిరిజనులం. ప్రభుత్వం మాకు 2020లో సాగు చేసుకుని బతికేందుకు భూమి పట్టాలు ఇచ్చింది. కానీ ఇంతవరకు 1-బీలు మాత్రం రావడం లేదు. సచివాలయం చుట్టూ, తహశీల్దారు కార్యాలయాల చుట్టూ గత మూడేళ్లుగా తిరుగుతూనే ఉన్నాం. ఇదిగో... అదిగో అంటూ మాటలే తప్ప మాకు ఎటువంటి సాయం అందలేదు. మీరే మాకు దిక్కంటూ గ్రీవెన్స్‌కు వచ్చాం. మాకు 1-బీలు వచ్చేలా చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నాం...'అంటూ ఆ పేద గిరిజనులు స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన గ్రీవెన్స్ (మీకోసం)లో కలెక్టర్‌కు వినతిపత్రం అందశారు.



భార్గవ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన దాపాకులగూడ వాసులు

భూమిని ఆక్రమించారు

'మేమంతా పేద దళిత కుటుంబానికి చెందిన వారం. మా తండ్రి అయిన లేటు చిత్తూరు లచ్చుముకి 50 ఏళ్ల కిందట ప్రభుత్వం 2.11 ఎకరాల భూమిని ఇచ్చింది. దీనిపై పట్టా కూడా అందజేశారు. అప్పటి నుంచి అదే భూమిని సాగు చేసుకుంటూ ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు బతుకుతున్నాం. రెండేళ్ల క్రితం మా గ్రామంలోని పెద్ద కులానికి చెందిన వారు మా భూమిని ఆక్రమించుకుని, మమ్మల్ని తరిమేశారు. అడిగితే చంపడానికి మీదికి వస్తున్నారు. మేం భయం భయంగా బతుకుతున్నాం. మా జీవనాధారమైన భూమి భూమిని దయచేసి మాకు ఇప్పించండి' అంటూ లావేరు మండలంలోని కొత్త కుంకాం గ్రామానికి చెందిన పేద దళితులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.



గ్రీవెన్స్ వద్ద కొత్తకుంకాం దళితులు

జాతీయ స్థాయి బాక్సింగ్‌లో మెరిసిన భార్గవ్

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 28(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాక్సింగ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన గంధం సత్య భార్గవ్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈమేరకు సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జెడ్పీ హాలులో భార్గవ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎం. మహేష్ కలెక్టర్‌కు భార్గవ్ సాధించిన విజయాల గురించి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కోసం పతకాల వేటలో ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాక్సింగ్ ఉపాధ్యక్షుడు బి.అనంత లక్ష్మణదేవ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె.శ్రీధర్, శిక్షకులు ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించండి

శ్రీకాకుళం రిమ్స్, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు రిమ్స్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 15 ఏళ్లుగా సెక్యూరిటీ గార్డులుగా సేవలు అందిస్తున్నామని... సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేసారు. అసలే అంతంతమాత్రం వేతనాలని... దీనికి తోడు సకాలంలో చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పాత కాంట్రాక్టర్ మే నెల వేతనం, ఏప్రిల్, మే బకాయిలు చెల్లించలేదని తెలిపారు. జూన్‌లో కొత్త కాంట్రాక్టర్ బాధ్యతలు తీసుకుని ఇప్పటి వరకూ వేతనం చెల్లించలేదని తెలిపారు. వేతనాలు లేకుండా కుటుంబాలతో ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కో కన్వీనర్ గోవర్ధనరావు, రిమ్స్ నాయకులు ఎం.సూర్యనారాయణ, టి.రామారావు, బి.శ్రీను, ఎస్.రాజేంద్ర, ఎం.శ్రీను, హెచ్.లక్ష్మణ, డి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'బుద్ధునితో నా ప్రయాణం'

శ్రీకాకుళం కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవితంలోని ముఖ్య ఘట్టాలు.. బౌద్ధమతం వైపు ఆయన నడకకు గల కారణాలతో రూపొందించిన 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం ఆద్యంతం అలరించింది. అభ్యుదయ ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక హోటల్‌లో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. బుద్ధుని బోధనల సారాంశాన్ని.. డాక్టర్ అంబేద్కర్ జీవితంపై వాటి ప్రభావాన్ని ఈ నాటకంలో ఆసక్తికరంగా చూపించారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, దళిత ఆదివాసీ బహుజన సంఘాల జె.ఏ.సి. ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటకానికి కేకే రాజు దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో డా. హర్షవల్లి, కంఠం వేణు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బుద్ధుడు, అంబేడ్కర్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.






బుద్ధునితో నా ప్రయాణం నాటకంలోని దృశ్యాలు

స్విమ్మింగ్‌పూల్‌కు మంచిరోజులు

- రూ.72 లక్షలతో కొత్తది నిర్మాణం
- మరో ఆరు నెలల్లో అందుబాటులోకి..

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీ దరిలో నాగావళి నదికి ఆనుకుని ఉన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్విమ్మింగ్‌పూల్‌కు మంచి రోజులు వచ్చాయి. సుమారు రెండు దశాబ్దాల కిందట కేవలం ప్రాథమిక స్థాయిలో నేర్చుకోవడానికి వీలయ్యే విధంగా 25 మీటర్ల పొడవు, 13 మీటర్ల వెడల్పుతో ఈ స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించారు. నాటి నుంచి ఎందరో క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల వరకు ఎదిగేటట్టు చేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈత కొలను లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వచ్చింది. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల చొరవతో ఉన్నత ప్రమాణాలతో కూడిన పూల్‌గా తీర్చి దిద్దేందుకు సుమారు రూ.72 లక్షల అంచనా వ్యయంతో టెండర్‌కు పిలిచేందుకు సమాయత్తం అవుతున్నారు. జాతీయ స్థాయి పోటీలకు అనుకూలంగా 50 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పు, రెండు ఫిల్టర్ పాయింట్లతో దీన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



ప్రస్తుతం ఉన్న స్విమ్మింగ్ పూల్

ఆదమరిస్తే అంతే..

కొత్తూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి రహదారిలో కలిగాం జంక్షన్ వద్ద కల్వర్టు సగం కూలిపోవడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. రాత్రి పూట ప్రయాణించే వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే ప్రమాదం బారినపడే అవకాశం ఉంది. అకులతంపర ఇసుక ర్యాంపు నుంచి భారీ వాహనాలు రావడం వల్ల ఈ కల్వర్టు కుంగిపోయింది. మండల కేంద్రం కొత్తూరుకి చేరుకునేందుకు సుమారు 15 గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. అందువల్ల నిత్యమూ వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మలేరియా లక్షణాలతో విద్యార్థిని మృతి

● కొనొకా గిరిజన గ్రామంలో విషాదఛాయలు



గాయత్రి (ఫైల్)

కంచిలి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొనొకా గిరిజన గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని గాయత్రి దొండియా(13) మలేరియా జ్వర లక్షణాలతో బాధపడుతూ బరంపురం ఎంకేసీజీ ఆసుపత్రిలో ఆదివారం రాత్రి మృతి చెందింది. స్థానికులు, బాలిక తల్లితండ్రులు తిలోత్తమ, భైలోడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గాయత్రికి విపరీతమైన జ్వరం రావడంతో ఈనెల 17న ఎంఎస్ పల్లి పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి సోంపేట సామాజిక ఆసుపత్రికి రిఫర్ చేయగా అక్కడి వైద్యులు పరీక్షలు చేసి మెరుగైన వైద్యం కోసం బరంపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. విద్యార్థిని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దీనిపై ఆసుపత్రి వైద్యురాలు సుస్మితా రెడ్డిని వివరణ కోరగా గాయత్రిని ఆసుపత్రికి తీసుకువచ్చే సమయానికి జ్వర లక్షణాలు ఉన్నాయని, మెరుగైన వైద్యం కోసం సోంపేట సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వైద్యులు, సిబ్బంది పనితీరుపై విమర్శలు

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న పరిస్థితుల్లో ఎంఎస్ పల్లి ఆసుపత్రిలో వైద్యులు ఉండడం లేదని, సిబ్బంది తీరు సరిగా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి వైద్యాధికారి సక్రమంగా రావడం లేదని, సిబ్బంది సైతం అలాగే వ్యవహరిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని, వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే బాలిక మృతి చెందిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాశ్రేయస్సు కోసం కూటమి అడుగులు: శంకర్



కరపత్రం అందించి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం భైరి, కరజాడ గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కరజాడ మాజీ సర్పంచ్ పాతిన రామారావు, నేతలు ఎండు చిన్నారావు, గొండు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రానున్న మూడేళ్లలో ప్రతీ కుటుంబానికి ఇల్లు

● ఎస్ఎస్ఎల్ఆర్ ఏడీ గోవిందరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రానున్న మూడేళ్లలో జిల్లాలో అర్హత గల ప్రతీ ఒక్క కుటుంబానికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సర్వే, భూమి నమోదు విభాగం అదనపు సంచాలకుడు ఆర్.గోవిందరావు అన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా రెవెన్యూ, రీసర్వే, పీజీఆర్ఎస్, హౌసింగ్ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. స్థలాలు అందుబాటులో లేని పట్టణ ప్రాంతాల్లో టిడ్కో గృహాల ద్వారా నివాసాలు కల్పించాలని, పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతీ అర్జీపై తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల న్నారు. 2019 కన్నా ముందే అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషన్ పూర్తి చేయాలని, ఈ ప్రక్రియను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకో వాలన్నారు. ఎస్సీ హేబిటేషన్ల వద్ద శ్మశాన వాటికలు నిర్మించాలని, వాటికి రహదారులను ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టాలన్నారు. రీసర్వే-2 డిశంబరు 27 నాటికి పూర్తి కావాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు నగరంలో ఉద్యోగ మేళా

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని నెహ్రూ యువ కేంద్రం (ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రక్కన)లో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టుల్లో వివిధ పోస్టులకు ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు విశాఖపట్నం, శ్రీకాకుళంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. డబ్లుడబ్లుడబ్లు. ఎన్‌సిఎస్. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ముందుగా నమోదు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో నమోదైన వారు బుధవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

క్రీడాకారుడికి కలెక్టర్ అభినందన



చరణ్‌ను అభినందిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్ జరిగిన ఏషియన్ అండర్-16 వాలీ బాల్ టోర్నమెంట్‌లో సత్తా చాటి పతకం సాధించిన జిల్లాకు చెందిన అట్టాడ చరణ్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభినందించారు. ఈ మేరకు జడ్పీ సమావేశ మంది రంలో చరణ్ కు శాలువా కప్పి జ్ఞాపిక అందించారు.

పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

సోంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీల్లో పట్టణానికి చెందిన కాశి శివకుమార్ సత్తాచాటాడు. పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో బెంచ్ ప్రెస్ పవర్ లిఫ్టింగ్ పోటీలో బంగారు పతకం, పవర్ లిఫ్టింగ్‌లో రజితం సాధించాడు. స్నేహితులు, గ్రామస్థులు అభినందించారు.

'అమ్ముదాం ఆంధ్ర చందంగా కూటమి పాలన

శ్రీకాకుళం అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'అమ్ముదాం అంధ్ర' అన్న చందంగా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందని, కారు చౌకగా కంపెనీలకు భూములను ధారాదత్తం చేస్తోందని మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు విమర్శించారు. సోమవారం పెద్దపాడు వద్ద ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంతులేని అవినీతి జరుగుతోందని, టీసీఎస్‌కు 90 ఎకరాల భూమి ప్రభుత్వం ఇస్తోందని విమర్శించారు.

పశువులు పట్టివేత

రణస్థలం, జూలై 28(ఆంధ్రజ్యోతి): బరంపురం నుంచి విశాఖపట్నం వైపు పశువులకు తరలిస్తున్న వాహనాన్ని పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద సోమవారం పట్టుకున్నట్లు ఎస్ఐ ఎస్ చిరంజీవి తెలిపారు. వాహనంలో 21 దున్నపోతులను తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించామన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శ్రీకాకుళం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపాడు కేంద్రీయ విద్యాలయం సమీపంలో నివసిస్తున్న యవ్వారి అనూష (30) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కుటుంబంలో కుమార్తె మొదటి చీరకట్టే శుభకార్యం నిర్వహణపై భార్యభర్తలైన యవ్వారి రాజేష్, అనూషల మధ్య వివాదం తలెత్తింది. తన అభిప్రాయానికి తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని భావించి అనూష తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం దోమల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలస్యంగా స్కూలుకు వస్తున్నారని..

● రోడ్డుపైనే విద్యార్థులు
● గేటుకు తాళం వేసి తల్లిదండ్రుల నిరసన



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

ఆమదాలవలస, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు ఆలస్యంగా వస్తున్నారంటూ విద్యార్థులను లోపలికి అనుమతించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహానికి గురయ్యారు. ఈ మేరకు సోమవారం పాఠశాల గేటుకు తాళంవేసి నిరసన తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాల గత నాలుగు రోజులుగా ఆలస్యంగా వస్తున్నారంటూ విద్యార్థులను లోపలికి అనుమతించడం లేదు. రోడ్డుపైనే వారిని నిలిపివేస్తుండడంతో సమీపంలోని గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. పాఠశాల యాజమాన్య వింత పోకడలపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ సుమారు 70 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తంచేశారు. దీంతో పాఠశాల యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చింది. వారు అక్కడికి చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చజెప్పినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఎంఈవో జి.రాజేంద్రప్రసాద్ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విషయాన్ని జిల్లా ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి దృష్టికి తీసుకువెళ్లారు. సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద చోటుచేసుకున్న ఘటనపై జిల్లా విద్యా శాఖాధికారులు తెలుసుకుని డిప్యూటీ డీఈవోను పంపారు.

సొంత వాహనాల్లో వస్తే అనుమతించడం లేదు

మా పిల్లలు గ్రామాల నుంచి ఆటోల్లో ఉదయం 8.30 గంటలకు వచ్చినా లోపలికి అనుమతిం చడం లేదని, అదే పాఠశాలకు చెందిన వాహనం 9 గంటలకు వచ్చినా అనుమతిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు డిప్యూటీ డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాల సమయం అయిపోయిందంటూ మా పిల్లలను నిత్యం రద్దీగా ఉండే రోడ్లపైనే ఉంచేస్తుండడంతో ఎండలో ఇబ్బందులు పడడంతో పాటు ఎప్పుడు ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నామన్నారు. కణుగులవలసకు చెందిన తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తాము ఫీజులతో పాటు ఏడాదికి సంబంధించిన బస్సు చార్జీలను పాఠశాల యాజమాన్యానికి చెల్లించి నెలలవుతున్నప్పటికీ మా గ్రామానికి పాఠశాల బస్సు రావడం లేదని డిప్యూటీ డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు.



విచారణ చేపడుతున్న డిప్యూటీ డీఈవో విజయకుమారి

బయట ఉంచడం సరికాదు: డిప్యూటీ డీఈవో

విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులను విచారించిన తరువాత డిప్యూటీ డీఈవో విజయకుమారి మాట్లాడుతూ.. పాఠశాల సిబ్బందిపై అసహనం వ్యక్తంచేశారు. సమయ పాలన పాటించినా.. పది నిమషాలు అటు ఇటుగా విద్యార్థులను తరగదులకు అనుమతించాలన్నారు. ఒకవేళ మరింత ఆలస్యంగా వస్తే పాఠశాల ఆవరణలో ఉంచాలి తప్ప రోడ్డుపై, ఆరుబయట ఉంచడం సమంజసం కాదన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆందోళనలో అర్థం ఉందని, అయితే పాఠశాల నియమాలను కూడా పాటించాలంటూ తెలియజేశామన్నారు. యాజమాన్యం కూడా ఇటువంటి చర్యలు తీసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ ఘటనపై నాలుగు రోజుల్లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సమాధానం ఇవ్వాలని నోటీసు ఇచ్చామన్నారు.

11 నుంచి లా సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లోని 3, 5 ఏళ్ల న్యాయ శాస్త్ర విద్యార్థులకు వివిధ సెమిస్టర్ పరీక్షలు వచ్చే నెల 11వ తేదీ నుంచి నిర్వహి స్తున్నట్లు డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. 2, 4, 6, 8, 10 సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. వచ్చే నెల 8వ తేదీ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

మున్సిపాల్టీలో అక్రమాలను అడ్డుకోండి

ఇచ్ఛాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో ఈనెల 4న జరిగిన టెండర్ల ప్రక్రియలో జరిగిన అక్రమాలను అడ్డని విచారణ చేపట్టాలని పట్టణానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ పేడాడ అప్పాలస్వామి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఇచ్ఛాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోమవారం బిర్లంగి గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప పాల్గొన్నారు.

కుక్కల దాడి: దూడకు గాయాలు

పొందూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాపాక గ్రామంలో కొన్ని రోజులుగా మూగజీవాలపై కుక్కలు దాడులు చేసి గాయపరుస్తున్నాయి. సోమవారం కొంచాడ సూర్యనారాయణకు చెందిన ఆవు దూడపై శునకాల గుంపు దాడిచేశాయి. దీనిని గమనించిన కొందరు కుక్కలను తరిమివేయడంతో దూడ తీవ్ర గాయాలకు గురై ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది.పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కలెక్టరేట్ పనుల పరిశీలన

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సమీకృత కలెక్టరేట్ నిర్మాణం పనులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. రహదారి ఆకృతి, కాలువల నిర్మాణం తదితర అంశాలను కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిపై సమీక్షించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పార్కింగ్, భద్రతా గదుల పనుల వివరాలను తెలుసుకుని నాణ్యతలో ఎటువంటి రాజీ పడవద్దని స్పష్టం చేశారు.

ఘనంగా ఆండాళ్ తిరునక్షత్రం



శ్రీకాకుళం కల్చరల్ జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆండాళ్ తిరునక్షత్రం సందర్భంగా పీఎన్‌కాలనీలోని నారాయణ తిరుమలలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. పాత శ్రీకాకుళంలో కల్యాణ తిరుమలలో గోదాదేవికి అమ్మవారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేపట్టారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక వస్త్రాలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు పాల్గొన్నారు.

వసతిగృహాల ఆకస్మిక తనిఖీ



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

శ్రీకాకుళం లీగల్ జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాలను సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న వసతి, ఆహారం, పరిశుభ్రతపై ఆరా తీశారు. ఆయన వెంట సీనియర్ న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్, వసతిగృహ అధికారులు ఉన్నారు.

ధర్మస్థలి ఘటనపై చర్యలు తీసుకోవాలి

సోంపేట రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం ధర్మస్థలిలో జరిగిన ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పుక్కళ్ల ఆరేళ్లమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప్పలాం పంచాయతీ లో సోమవారం మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మాడికమ్మ, నీలవేణి, బాసమ్మ, లక్ష్మి, గంగవేణి, పూజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎన్ఈఆర్



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చర్యలు తీసుకుంటు న్నామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) అన్నారు. సోమవారం నడిమివలసలో 'నమస్తే ఎచ్చెర్ల-మన ఊరికి మన ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో దేశాన్ని, రాష్ట్రాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్లాలో ఆలోచించ గల విజన్ ఉన్న నాయకులు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు అని అన్నారు. గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, తాగునీరు అందించి అభివృద్ధి చెందిన గ్రామాలుగా తీర్చిదిద్దిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నేతలు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, వజ్జపర్తి రఘురాం, కామోజుల సీతారాం, ఎంపీడీవో రామకృష్ణ, డీటీ నిర్మల, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి నీరు సకాలంలో విడుదల చేయాలి

రణస్థలం, జూలై 28(ఆంధ్రజ్యోతి): తోటపల్లి కాలువ ద్వారా నీటిని సకాలంలో విడుదల చేసి శివారు ప్రాంతాలకు సరఫరా చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో తోటపల్లి కాలువ అధికారులతో సమీక్షించారు. రొటేషన్ విధానంలో నీటి పంపిణీ జరుగుతోందని, త్వరలో నీరు వస్తుందని అధికా రులు వివరించారు. కార్యక్రమంలో డీఈ లావణ్య, ఏఈ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి: ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో బాధితులకు సత్వరమే న్యాయం అందించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఇచ్చిన 52 మంది నుంచి వినతులు స్వీకరించారు. బాధితులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన విచారణ చేపట్టి బాధితులకు న్యాయం అందించాలన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఇచ్ఛాపురం, జూలై28(ఆంధ్రజ్యోతి): గంజాయి, గుట్కా వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కేదారిపురం గ్రామంలో స్థానికులతో సమావేశం నిర్వహించి మాదక ద్రవ్యాలు, సైబర్‌నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగించారు. అలాగే ముచ్చింద్ర గ్రామం వద్ద ఒడిశా నుంచి ఆంధ్రాలోకి వస్తున్న ప్రతీ వాహనాన్ని తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా వచ్చిన వారికి, బైక్ పత్రాలు లేని వారిని పట్టుకొని హెచ్చరించారు.

ప్రతీ విద్యార్థికి ఉచితంగా వైద్యం

● జిల్లాలో 3.06 లక్షల మందికి వైద్య పరీక్షలు
● డీఎంహెచ్‌వో డా.కె.అనిత

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహించి ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా పూర్తిస్థాయిలో ఉచితంగా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డా.కె.అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డా.ఇప్పిలి వెంకట్ పర్యవేక్షణలో జిల్లాలో 3,06,516 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అనారోగ్య సమస్యలను గుర్తించి చికిత్స అంది స్తామన్నారు. అవసరమైతే మెరుగైన వైద్య సేవలు కలిగిన ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్సలు అందజేస్తామని చెప్పారు. ఈనెల 15 నుంచి జిల్లాలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు ప్రారంభమయ్యాయని, దీనివల్ల చిన్నతనంలోనే ఆరోగ్య సమస్య లు గుర్తించి వాటిని నివారించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఆరోగ్యకరంగా ఉండాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గ ఎన్నిక

ఆమదాలవలస, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల, మున్సిపాలిటీ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని గాజుల కొల్లివలస చర్చిలో సోమవారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు నియోజకవర్గ సంఘ పెద్దలు రాడ విజయ్‌కుమార్, డాక్టర్ జార్జిముల్లర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా స్టీఫెన్, ప్రధాన కార్యదర్శిగా శ్యామ్, కోశాధికారి విజయ్, వైస్ ప్రెసిడెంట్‌గా షద్రక్ బాబు, సహకార్యదర్శిగా దుర్గాప్రసాద్, ఉపకోశాధికారి డేవిడ్‌లను ఎన్నుకున్నారు.

న్యూస్ బాక్స్

'తల్లికివందనం' రానివారి వివరాలు నమోదు చేయాలి

పొందూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతీ విద్యార్థికి ప్రభుత్వం తల్లికివందనం అందిస్తుందని డిప్యూటీ విద్యాశాఖాదికారి ఆర్.విజయకుమారి అన్నారు. కింతలి జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. సాంకేతిక కారణాలతో తల్లికి వందనం పథకానికి దూరమైన విద్యార్థులను గుర్తించి అటువంటి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని హెచ్ఎం గోవిందరావును ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాకిట్లను విద్యార్థులందరికీ అందించే బాధ్యత హెచ్ఎంలదేనన్నారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించండి

రణస్థలం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మి కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో చేరిన విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, ప్రాక్టికల్ రికార్డులు, పోటీ పరీ క్షల పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మధ్యా హ్న భోజనం అందిస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో అధ్యాపకులు ఉన్నారని, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారన్నారు. ఇప్పటికే కళాశాలలో 134 మంది చేరారని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 31వ తేదీలోగా కళాశాలలో చేరాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కొండపోరంబోకు భూములను పేదలకు పంచాలి

ఆమదాలవలస, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కొండపోరంబోకు భూములను పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోని సైలాడ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 183లో సుమారు 225 ఎకరాల సంగమయ్య కొండను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండ పోరంబోకు భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని పరిరక్షించి పేదలకు అందించాలని ఆయన కోరారు. స్థానిక యువత పాల్గొన్నారు.

వంశధార నీరు వచ్చేంత వరకూ పోరాటం

ఇచ్ఛాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు వంశధార కాలువ ద్వారా సాగునీరు వచ్చే వరకు పోరాటం చేస్తామని రైతుకులం, రైతుమిత్ర సంఘం నియోజకవర్గ కన్వీనర్ జన్నెల ప్రసాద రావు అన్నారు. సోమవారం బెల్లుపడ జామి ఎల్లమ్మ గుడి వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నీటిని విడుదల చేసి రైతులకు న్యాయం చేసేలా ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రైతు కుల సంఘ ప్రతినిధులు ఆశి చిరంజీవులురెడ్డి, దుర్గాశి పాపారావు, బి.కామేష్‌రెడ్డి, మార్పు మన్మథరావు, ఆయా సంఘాల ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఆమదాలవలస, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దూసి-పొందూరు రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుడి వయసు సుమారు 65 సంవత్సరాలు ఉంటుందని, షర్టు, లుంగీ ధరించి ఉన్నాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించామన్నారు. అతడి ఆచూకీ తెలిసిన వారు 9493474582 నెంబర్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

రణస్థలం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరానికి చెందిన వృద్ధుడు పితాపురం కనకరాజు కొద్దిరోజులుగా కనిపించడం లేదని ఆయన కుటుంబసభ్యులు సోమవారం ఫిర్యాదుచేసినట్లు జేఆర్‌పురం పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కనకరాజు ఆచూకీ తెలిసినవారు 9010985148, 9493596747 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

90 లీటర్ల సారా స్వాధీనం

కంచిలి, జూలై 28(ఆంధ్రజ్యోతి): కేసరిపడ గ్రామ సమీపంలో సోమవారం సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 90 లీటర్ల సారా, కారు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. నాలుగు పాలిథిన్ కవర్లలో ఉంచిన 900 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తరలిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన మొగలి కుమార్, సారా తెప్పించిన పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన లొట్ల జోగారావులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బంది మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతి, గుణకర్‌ను సీఐ అభినందించారు.

పాతపట్నంలో..

పాతపట్నం, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేగేటు సమీపంలో ఆదివారం సాయంత్రం అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదుచేసినట ఎస్‌ఐ బి.లావణ్య తెలిపారు. ఈ మేరకు పోలాకి మండలంలోని ఈదులవలసకు చెందిన ఓ వ్యక్తి పది టిన్ బీరు బాటిళ్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

పాతపట్నం, జూలై 28(ఆంధ్రజ్యోతి):మండలంలోని కాగువాడలో పేకాట శిబిరంపై ఆదివారం అర్ధరాత్రి దాడి చేసినట్లు సీఐ వి.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా పాతపట్నానికి చెందిన ఎనిమిది మంది పేకాటరాయుళ్లను పట్టుకొని వారి నుంచి రూ.1,12,030 నగదుతోపాటు ఆరు ద్విచక్రవాహనాలు ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చెప్పారు.ఈ మేరకు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడికి బ్రెయిన్‌డెడ్

● అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు


శ్రీరాములు (ఫైల్)

కోటబొమ్మాళి, జూలై 28(ఆంధ్రజ్యోతి) : నిమ్మాడ జంక్షన్‌కు చెందిన ఓ యువకుడు బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవదానానికి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం మేరకు..సారవకోట మండలంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళిమండలంలోని నిమ్మాడ జంక్షన్‌కు చెందిన పినిమింటి శ్రీరాములు (20) గాయపడ్డాడు. దీంతో శ్రీకాకుళం సమీపంలోగల రాగోలులో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నేపథ్యంలో అక్కడి వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా ధ్రువీకరించారు. దీంతో ఆయన అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు లక్ష్మణరావు, లక్ష్మిలు, కుటుంబసభ్యులు అంగీకరించారు. గుండె, కళ్లు, లివర్‌ను సోమవారం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సేకరించారు. కాగా సోమవారం మృతదేహం నిమ్మాడ జంక్షన్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, యువకులు పెద్ద ఎత్తున నిమ్మాడ జంక్షన్ నుంచి శ్రీరాములు ఇంటి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

షోకాజ్ నోటీసులిచ్చినా షరామామూలే

● టెక్కలిలో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

టెక్కలి, జూలై 28(ఆంధ్రజ్యోతి): టెక్కలి సబ్‌కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌కు పలుశాఖల అధికారులు డుమ్మాకొడుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి గైర్హాజరైన కొందరు అధికారులకు మెమోలు, మరికొందరికి షోకాజ్ నోటీసులు జారీచేసినా షరామమూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలొస్తున్నాయి. తాజాగా సోమవారం వంశధార ఈఈ, డీఎల్‌డీవో, పీఆర్ ఈఈ, ఈపీడీసీఎల్ ఈఈ, మెడికల్ సూపరింటెండెంట్, వెలుగు ఏపీడీ, డిప్యూటీ ఎంపీడీవో వంటి అధికారులు గైర్హాజరయ్యారు. సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, డివిజినల్ పంచాయతీ కార్యాలయ శాఖ, ఆర్‌అండ్‌బీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో తదితర శాఖలకు సంబంధించి కిందిస్థాయి సిబ్బంది హాజరయ్యారు. గైర్హాజరైన అధికారులకు ఆర్డీవో మెమోలు, షోకాజ్ నోటీసులు జారీచేసినా వారి తీరు మారకపోవడం విశేషం. కాగా ఈ సందర్భంగా 13 వినతులు అందగా, సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో షైమావతికి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సమస్యలపై ఎక్కువ వినతులు అందయి.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

పాతపట్నం, జూలై 28(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు టి.త్రినాథరావు కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.సోమవారం పాతపట్నంలో వీఆర్‌ఏల మండలస్థాయి సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 6, 7 తేదీల్లో మండలస్థాయిలో ప్రదర్శనలు ధర్నాలు,18నుంచి 20వతేదీ వరకూ నిర్దేశిత జిల్లాలు విజయవాడలో నిరాహారదీక్షలు నిర్వహణకు సమాయత్తం కావాలన్నారు.ఆగస్టు 21న చలో విజయవాడ కార్యక్రమం విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. తదుపరి రాష్ట్ర కమిటీ సమ్మె తేదీ నిర్ణయిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పి.అప్పలస్వామి మండల అధ్యక్ష కార్యదర్శులు పి.వెంకటరమణ బి.రాజారావు, వీఆర్‌ఏలు నాగభూషణరావు, పి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం

పలాస రూరల్,జూలై28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో సోమవారం జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రీప్రైమరీ విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. మాతాపితృ నమోదేవో అన్న మంత్రాన్ని పలుకుతూ తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు.కార్యక్రమంలో పాఠశాల జిల్లా ఇన్‌చార్జిలు ఎంపీఎస్‌మూర్తి, శ్రీనివాసరావు, ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, వైస్‌ప్రెసిడెంట్ తాళాసుశ్రీనివాస్,ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి పాల్గొన్నారు.


తల్లిదండ్రులకు పాదపూజలు చేస్తున్న విద్యార్థులు

కాలువలు మూసుకుపోయి.. ఇళ్లలోకి వర్షం నీరు చేరి


బయటకు వెళ్లే మార్గం లేక సర్వీస్‌రోడ్డుపై నిల్వ ఉన్న వర్షం నీరు

●దోమల స్వైరవిహారం ● ఇదీ పాకివలసలో పరిస్థితి

కోటబొమ్మాళి, జూలై28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుడు పంచాయతీలోగల పాకివలసలో సమస్యలు తిష్ఠవేశాయి. ప్రధానంగా పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాలువలు మూసుకుపోవడం వల్ల రోడ్డుపైకి మురుగునీరుచేరుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపైకి మురుగు నీరు నిల్వఉంటోంది. తరచూ కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ఈ గ్రామం ఎటువంటి మౌలిక సదుపాయాలకు నోచుకోకపోవడంతో అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో బయటకు మురుగువెళ్లేందుకు వీలులేకపోవడంతో చిన్నపాటివర్షానికి రోడ్డుపైకి నీరు చేరి ఇళ్లలోకి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. వర్షం నీటితో పాటు మురుగు రోడ్డుపై నిల్వఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.ఫ్లైఓవర్ బ్రిడ్జిలోపల,టెక్కలివైపు వెళ్లే సర్వీస్‌రోడ్డులో ఉన్న డ్రైనేజీ మూసుకు పోవడంతో వర్షం నీరు రోడ్డుపైనే ఉండడంతో గ్రామస్థులతో పాటు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రతి ఇంటికి పథకాలు అందాలి

● రాష్ట్ర గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర

పలాస, జూలై28(ఆంధ్రజ్యోతి):ప్రతిఇంటికి కూటమి ప్రభుత్వసంక్షేమ పథకాలు అందాలని రాష్ట్ర గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు.కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. సోమవారం పలాస టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశంనిర్వహించారుఈసందర్భంగా మాట్లాడుతూ వైసీపీ హయాంలో భయానకమైన పాలన ప్రజలు చూశారని, ప్రతిపక్ష నాయకులపై ప్రదర్శించిన దాష్టీకం ప్రజలు మరచిపోలేదన్నారు. కింజరాపు అచ్చెన్నాయుడును అరెస్టు చేసిన తీరు విమర్శలకు దారితీసిందన్నారు. ఆయనకు ఆపరేషన్ జరిగి 24 గంటలు కాకముందే వాహనంలో 18 గంటలపాటు తిప్పారని గుర్తుచేశారు. వైసీపీ చేసిన రూ.లక్షలకోట్లు అప్పులు శాపంగా మారాయని తెలిపారు. వైసీపీ హయాంలో వెళ్లిపోయిన లులూ వంటి కంపెనీలు సైతం విశాఖ, విజయవాడలో మాల్స్ నిర్మించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు.ఎమ్మెల్యే గౌతు శిరీష వైసీపీ పాలనలో కార్యకర్తలు పడిన ఇబ్బందులు, అవమానాలు వివరించారు.

కుంభకోణాలు బయటపడుతుండడంతో విష ప్రచారం

వైసీపీ పాలనలో చేసిన కుంభకోణాలు బయట పడుతుండడంతో కూటమి ప్రభుత్వంపై కూడగట్టుకొని విషప్రచారం చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.పలాసలో విలేకరులతో మాట్లాడుతూ గంజాయి పండించే రైతులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు వారికి ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి అవకాశాలు కల్పించామన్నారు.శాటిలైట్లు, డ్రోన్ల సహాయంలో సాగుకేంద్రాలు గుర్తించామని,చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ఎక్కడికక్కడే కట్టడి చేశామన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకూ 85లక్షల గృహాలకు వెళ్లామని చెప్పారు. ఆగస్టులో అన్నదాత సుఖీభవ కింద రైతులకు మొదటివిడతగా రూ.ఏడువేలు ఖాతాలో జమచేస్తామని తెలిపారు. వైసీపీ హయాంలో పలాసలో గౌతు శిరీషకు కూడా ఇబ్బందులుపెటారని, నల్లబొడ్లూరు కొండ, సూది కొండలను బోడి కొండలు చేశాని, అవన్నీ పరిశీలిసున్నామని, వీటిపైవిచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, చౌదరి బాబ్జి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అసెంబ్లీ బీసీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా
నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి అసెంబ్లీ కమిటీలో చోటు కల్పించారు. శాసనసభ, శాసనమండలి సంబంధించి శాసనసభ స్పీకర్ అయ్యనపాత్రుడు, మండలి చైర్మన్ మోషన్‌రాజ్ 2025-26 ఏడాదికి సంయుక్త కమిటీలను నియమించారు.బీసీ వర్గాల సంక్షేమ కమిటీలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిగా సభ్యుడిగా నియమించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ బీసీ వర్గాల అభ్యున్నతికి పనిచేసే అవకాశం దక్కిందన్నారు. తనకు చోటు కల్పించిన స్పీకర్, చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో బీసీ వర్గాలు ఎక్కువగా ఉన్నారని, వారి అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశాలను పెంచాలి

పోలాకి,జూలై 28 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో ప్రవేశాలను పెంచాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. సోమవారం మబగాం క్యాంపు కార్యాలయంలో నియోజవర్గస్థాయి ఎస్సీ, బీసీ వసతిగృహాల సంక్షేమాధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో పోలాకి, ప్రియాగ్రహారం, కోడూరు, సారవకోట, జలుమూరు మండలాల వసతిగృహాల సంక్షేమాధికారులు పాల్గొన్నారు. కాగా క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి, నాలుగు మండలాల పరిధిలో అర్జీల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో బగ్గు అర్చన పాల్గొన్నారు.

భూ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలి

● ల్యాండ్ సర్వే అడిషినల్ డైరెక్టర్ గోవిందరావు

కోటబొమ్మాళి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు భూ సర్వే ద్వారా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ల్యాండ్ సర్వే అడిషినల్ డైరెక్టర్ రేణంకి గోవిందరావు కోరారు.మండలంలోని నారాయణవలసలో ఇటీవల భూ సర్వే జరగడంతో సోమవారం ఏపీ రీ-సర్వే ప్రాజెక్టులో భాగంగా గ్రామసభ నిర్వహించారు.ఈసందర్భంగా పలువురు రైతులు తల్లిదండ్రులు పేరుతో పాస్‌పుస్తకాలు కుమారుల పేరున మారడంలేదని, సర్వేనెంబర్లలో ఉన్న తమ భూమి తక్కువగా చూపిస్తోందని పలు సమస్యలను గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇటువంటి సమస్యలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామసభలో టెక్కలి ఆర్డీవో ఎన్. కృష్ణమూర్తి, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఆర్‌ఐ పవిత్ర పాల్గొన్నారు. అనంతరం ఆయన తన సొంత గ్రామం మండలంలోని గంగరాంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. తాను ఇక్కడే చదువుకున్నానని తెలిపారు.అనంతరం విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు అందజేశారు. ఆయనతో పాటు ఎంఈవో ఎల్వీ ప్రతాప్, గ్రామస్థులు ఉన్నారు.


మాట్లాడుతున్న గోవిందరావు


ఎల్.ఎన్.పేట: గొట్టిపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న కలమట వెంకటరమణమూర్తి


పాతపట్నం: ఇందిరమ్మ ఆదర్శనగర్‌లో పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

అర్హులందరికీ పథకాలు

●జిల్లా వ్యాప్తంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమపథకాలు అందజేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం జిల్లాలోని పలుచోట్ల తొలి అడుగుకార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా కరపత్రాలు అందజేసి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

●ఎల్.ఎన్.పేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశలవారీగా రాజకీయాలకతీతంగా అమలుచేస్తున్నామని టీడీపీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి తెలిపారు. మండలంలోని గొట్టిపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారప్రతినిధి ఎస్.కిషోర్‌కుమార్, కె. తిరుపతిరావు, జి.మోహనరావు, ఎం. సూర్యనారాయణ, జి.రాము, జి.వాసుదేవరావు, ఎం. జగదీశ్వరరావు పాల్గొన్నారు.

●పాతపట్నం,జూలై 28(ఆంధ్రజ్యోతి):ప్రతి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. పాతపట్నంలోని ఇందిరమ్మ ఆదర్శనగర్‌లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.

●జలుమూరు (సారవకోట) జూలై 28(ఆంధ్రజ్యోతి): సారవకోట మండలంలోని వడ్డినవలస, మాకివలస, వెంకటాపురంల్లో టీడీపీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ సుపరిపాలనలో తొలిఅడుగు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిక్కు జనార్దనరావు, కె.రాము, బలగ భాస్కర్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రను దోచుకున్న జగన్ సైన్యం

కోటబొమ్మాళి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఉత్తరాంధ్రను అన్నివిధాలజగన్, ఆయన సైన్యం దోచుకుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు ఆరోపించారు.సోమవారం కోటబొమ్మాళిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయకుండా ఊరుపేరులేనివారికి భూములు చౌకగా కట్టబెడుతున్నారని మాజీ మంత్రి అమరనాథ్ అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధిపనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇవీ వైసీపీ నాయకులకు కానరావడం లేదా అని ప్రశ్నించారు.

కూటమి పాలనతో ఉపాధి అవకాశాలు

పాతపట్నం, జూలై 28(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన కూటమి పాలనతోనే సాధ్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. సోమవారం పాతపట్నంలోని ఓ డిగ్రీకళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మెగా జాబ్ మేళా నిర్వహించింది.ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఉరిటి సాయికుమార్ మాట్లాడుతూ జాబ్‌మేళాకు 365మంది అభ్యర్థులు హాజరుకాగా వారిలో 162మందికి వివిధ హోదాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నియామక ఉత్తర్వులు అందజేసినట్లు చెప్పారు.కార్యక్రమంలో రాజగోపాలాచార్యులు, శాసనపురి మధుబాబు, టీడీపీనాయకులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, శ్రీరాం, దుర్గాప్రసాద్, తూలుగు తిరుపతిరావు, అక్కంద్ర సన్యాసిరావు, జోగారావు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి

నరసన్నపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): క్షణావేశానికి లోనుకాకుండా సత్ప్రవర్తన కలిగిఉండాలని స్థానిక ముస్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాణి సూచించారు. స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. పేద ఖైదీలకు ఉచితంగా న్యాయసలహాలను న్యాయసేవాధికార సంస్థ అందజేస్తుందని తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రత్నకుమార్

నరసన్నపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా తంగుడు రత్నకుమార్, కార్యదర్శిగా పొట్నూరు రమేష్, కోశాధికారిగా కాసిన రమేష్ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ గవర్నర్ డీవీఎస్ వర్మ, కె. సుబ్బారావు, రమణసాహూ, కె.సాయిరాం, సదాశివుని కృష్ణ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నరసన్నపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయిలో సెలక్షన్‌లో సత్తాచాటారు. వి.మానస అండర్ -16 విభాగంలో హర్డిల్స్‌లో ప్రథమ స్థానం, టి.హారిక జావెలిన్‌త్రోలో ద్వితీయ స్థానం సాధించి చీరాలలో జరిగే రాష్ట్రస్థాయి సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వెంకట్రావు తెలిపారు. ఈమేరకు సోమవారం ఎంపికైన విద్యార్థులను పీడీ ఎంవీ రమణ, గణపతి, సాయిశ్రీనివాసశర్మ అభినందించారు.

●పోలాకి, జూలై 28 (ఆంధ్రజ్యోతి):ఈదులవలస ఆదర్శపాఠశాల విద్యార్థులుశ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన పోటీల్లో సత్తాచాటారు.ఈ మేరకు ఆగస్టు 9,10,11, తేదీల్లో బాపట్లలో నిర్వహించనున్న సౌత్‌జోన్ మీట్ అండర్- 18 విభాగానికి డి.బాను, జి.మౌనిక, పి.వసంత, డి.వినీత్‌కుమార్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, పీడీ నీలం తెలిపారు.

పెండింగ్ బిల్లులపై సంప్రదించండి

టెక్కలి, జూలై 28(ఆంధ్రజ్యోతి): 2013-14 సంవత్సరం నుంచి 2019-20 వరకు ఊరూరాపశుగ్రాసక్షేత్రాలు, మినీగోకులాల పనులకు మెటీరియల్ చెల్లింపులు పెండింగ్‌లో ఉంటే సంప్రదించాలని పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకుడు సీహెచ్ నర్సింహులు కోరారు. ఏపీవో, పశుసంవర్ధకశాఖ సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు.

కాలువ ఆక్రమించి.. పునాది నిర్మించి


మొగిలిపాడు వద్ద వరదకాలువ(వృత్తంలో)పై పునాది నిర్మిస్తున్న దృశ్యం

●మొగిలిపాడులో చెరువు నుంచి నీరు బయటకు వెళ్లే చోట రక్షణ గోడ ఏర్పాటుకు ఓ వ్యాపారి చర్యలు ●కమిషనర్ పరిశీలన

పలాస, జూలై 28(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో గల ఒకటో వార్డు మొగిలిపాడు దత్తాశ్రమానికి వెళ్లేదారిలోగల వరద కాలువపై ఓ వ్యాపారి రక్షణగోడకోసం పునాది నిర్మాణం చేపడుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మొగిలిపాడు చెరువుకు సంబంధించిన నీరు పంట పొలాలకు వెళ్లే దారిలో ఆయన స్థలంతో పాటు పక్కన ఉన్న కాలువను రెండు సెంట్లు ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నాడు. వారంరోజుల నుంచి పనులు జరుగుతున్నాయి. నిర్మాణం పూర్తయితే చెరువు నీరు సులభంగా వెళ్లడానికి మార్గం ఉండదని రైతులువాపోతున్నారు. ఈవిషయం తెలుసుకున్న మునిసిపల్‌కమిషనర్ ఎన్.రామారావు నిర్మాణస్థలాన్ని సోమవారం పరిశీలించారు. పనులు నిలిపివేయాలని, అనుమతి పత్రాలు మునిసిపల్ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు.

గుణాత్మక విద్యనందించాలి

జలుమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన గుణాత్మకమైన విద్యనందించాలని ఎంఈవో బి.మాధవరావు తెలిపారు. మండలం అచ్యుతాపురం ప్రాథమిక పాఠశాలను సోమవారం తనిఖీ చేసి పిల్లలు సృజనాత్మకతను పరిశీలించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు, జూలై28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలపాడు గ్రామానికి చెందిన దున్న కిష్టమయ్యగారి అప్పారావు కుటుంబానికి ఉద్దానం హెల్పింగ్ హ్యాండ్ సంస్థ అండగా నిలిచింది. ఇటీవల తమిళనాడులో జరిగిన ఓ ప్రమాదంలో ఇంటి పెద్దగా ఉన్న అప్పారావు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. దీంతో హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ప్రతినిధులు కుటుంబ సభ్యులకు రూ.20వేలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కీలు విజయకుమార్, కీలు కమల, సావిత్రి, రామారావు, హేమారావు సంతోష్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరిస్తాం

పలాస, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. సోమవారం పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో (పీజీఆర్ఎస్) 45 వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా మరణ ధ్రువీకరణపత్రాలు, ఒంటరి మహిళ పింఛన్లు, వితంతు, దివ్యాంగ, వృద్ధాప్య పింఛన్ల కోసం ఎక్కువగా దరఖాస్తు అందాయి.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

మెళియాపుట్టి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుపై మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తప్పుడు ఆరోపణలుచేయడం మానుకోవాలని కొసమాళ పీఏసీఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు తెలిపారు. సోమవారం వసుంధరలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెడ్డి శాంతి తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలకు తప్పుదోవపట్టిస్తున్నారని చెప్పారు. వైసీపీ పాలనలో పాతపట్నానికి ఏమి చేశారో చూపించాలన్నారు. ఏడాది కూటమిపాలనలో సుమారు రూ.70 కోట్లు రహదారుల పనులుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు దినకర్‌రావు,కృష్ణారావు, పరమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

టెక్కలి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): టెక్కలి డివిజన్‌లో గల రఘునాథపురం వద్ద అంబేడ్కర్ భవనానికి పది సెంట్లు కేటాయించారని, అయితే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దళిత సంఘ జేఏసీ నాయకులు బోకర నారాయణరావు, గోపి,బాబురావు కోరారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపుఅచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రంలో మోసకారి పాలన

పాతపట్నం, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మోసకారి పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. సోమవారం మండలంలోని సీదిలో వైసీపీ నాయకులు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా, వసతిదీవెన వంటి సంక్షేమపథకాలకు తిలోదకాలిచ్చారని విమర్శించారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు సవిరిగాన ప్రదీప్, బి.నారాయణరావు ఇప్పిలి నారాయణ రావు, కృష్ణారావు పాల్గొన్నారు.

ఆలయానికి దారి ఏర్పాటు

మెళియాపుట్టి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలోని మల్లికార్జున ఆలయానికి దారి ఏర్పాటుచేశారు. కొద్ది రోజులుగా ఆలయానికి వెళ్లేదారిలో రేకులు షెడ్ ఏర్పాటుచేయడంతో ఇటీవల స్థానికులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో సోమవారం దేవదాయశాఖ అధికారులు ఆలయం వద్ద అడ్డుగా ఉన్న రేకులు తొలగించారు. ఆలయానికి చుట్టుపక్కల ఉన్న షాపుల యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.షాపులు యజమానులు ప్రతి నెలా అద్దెలు ఇవ్వాలని, లేకపోతే తొలగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే చేపట్టాలి

జలుమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) చిన్నతరహా సాగునీటి పథకాలపై పారదర్శకంగా సర్వే నిర్వహించాలని మండల గణాంకాధికారి బాన్న సుధాకర్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని చిన్న తరహా సాగునీటి పథకాలను గుర్తించి అవి ఏ స్థాయిలో ఉన్నాయి, నేల, గొట్టపు బావుల లోతు తదితర అంశాలు సర్వేలో పొందుపరచాలన్నారు. సర్వే వివరాల నెలాఖరులోగా సమర్పించాలని తెలిపారు. సమావేశంలో ఆర్‌ఐ కిరణ్ పాల్గొన్నారు.